మినుము సాగుకు.. అదును ఇదే

- జులై 15 వరకు అనుకూల సమయం
- ముందస్తు వర్షాలతో ఊరట
- తొలకరి వర్షాలు.. సాగుకు అనుకూలం
- కోవెలకుంట్ల వ్యవసాయాధికారి సూచనలు


కోవెలకుంట్ల సమీపంలో సాగు చేసిన మినుము పంట

కోవెలకుంట్ల: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన దృష్ట్యా.. ఈ సీజన్‌లో అదునుకు మినుము సాగు అన్ని విధాలా లాభదాయకం. 90 రోజుల కాలపరిమితి ఉన్న మినుమును ఏకపంటగా, కంది, పత్తిపైర్లలో అంతర పంటగా సాగు చేసుకోవచ్చు. జూన్ నెల నుంచి జులై 15 వరకు మినుము సాగుకు అదును కాగా సీజన్‌కు ముందే స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల పరిధిలో కురిసిన వర్షాలు సాగుకు అనుకూలంగా మారాయి. సబ్ డివిజన్‌లోని ఆయా మండలాల పరిధిలో 4583 ఎకరాల్లో మినుము సాగు సాధారణ విస్తీర్ణం కాగా ఇటీవల కురిసిన వర్షాలతో ఇప్పటి వరకు 608 ఎకరాల్లో సాగైంది. ఖరీఫ్‌లో మినుము సాగు పద్ధతులు, చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను కోవెలకుంట్ల మండల వ్యవసాయాధికారి సుధాకర్ రెడ్డి వివరించారు.

సాగు విధానం

మెట్ట ప్రాంతాల్లో తేమను నిలుపుకోగలిగి మురుగు నీరు పోయే వసతి ఉన్న భూములు అనువైనవి. బీడు భూములు పనికిరావు. ఎల్‌బీజీ 20(తేజ), టీ-9, ఎల్‌బీజీ 623, డబ్ల్యూబీజీ 26, పీబీసీ-1, ఎల్‌బీజీ 752 విత్తన రకాలు సాగుకు అనుకూలం. విత్తనానికి ముందు హెక్టారుకు 20 కిలోల నత్రజని, 50 కిలోల భాస్వరం నిచ్చే ఎరువులు వేసి గొర్రుతో కలియదున్నాలి. వరిమాగాణుల్లో మినుము వేసేటప్పుడు ఎరువులు వాడాల్సిన అవసరం లేదు. ఎకరాకు 6 నుంచి 7 కిలోల విత్తనం సరిపోతుంది. కిలో విత్తనానికి 30 గ్రాముల కార్బోసల్ఫాన్, 2.5 గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ మందును వాడి విత్తనశుద్ధి చేయాలి. వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పుడు ఒకటి, రెండునీటి తడులు ఇవ్వాల్సి ఉంటుంది. ఒకటి, రెండు తేలిక తడులు విత్తిన 30 రోజుల్లోపు, 55 రోజుల తర్వాత ఇవ్వాలి. మినుము విత్తనానికి ముందు ఫ్లుక్లోరాలిన్ ద్రావణాన్ని ఎకరాకు లీటరు చొప్పున భూమిపై పిచికారీ చేసి గుంటికతో పైపైన కలియదున్నాలి. పెండిమిథలిన్ ద్రావణాన్ని ఎకరాకు 1.3 నుంచి 1.6 లీటర్ల చొప్పున విత్తిన వెంటనే లేదా మరుసటి రోజు పిచికారీ చేయాలి. విత్తిన 20-25 రోజులప్పుడు గొర్రుతో అంతర కృషి చేయాలి. వరి మాగాణుల్లో ఊద, చిప్పెర, గరికలాంటి గడ్డిజాతి మొక్కల నిర్మూలకు ఎకరాకు 250 మి.లీ ఫెనాక్సోప్రాప్ ఇథైల్ అనే ద్రావణాన్ని లేదా ఎకరాకు 400 ఎంఎల్ క్విజాలాసాప్ ఇథైల్ అనే ద్రావణంలో ఏదో ఒకదానిని 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 20-25 రోజుల తర్వాత పిచికారీ చేసి కలుపు నివారించవచ్చు. తొలిదశలో అధిక తేమను తట్టుకుని త్వరగా పెరిగే ఎల్‌బీజీ 402, ఎల్‌బీజీ 611, ఎల్‌బీజీ 648 రకాలను సాగు చేయాలి.

సస్యరక్షణతో మంచి దిగుబడులు

- మొక్కను రెండాకుల దశలో చిత్తపురుగు ఆశించి చిన్న రంధ్రాలను చేసి మొక్కలకు నష్టం కలగజేస్తాయి. దీని నివారణకు లీటరు నీటికి 2.5 ఎంఎల్ క్లోరిపైరిఫాస్ కలిపి పిచికారీ చేయాలి.
- కాండపు ఈగ కాండంలో చేరి తినడం వల్ల మొక్కలు ఎండిపోతాయి. తొలకరి పైరును ఎక్కువగా ఆశిస్తుంది. దీని బెడద విత్తన తర్వాత 30 రోజుల వరకు ఉండి అనుకూల పరిస్థితుల్లో పైరు చివరి దశ వరకు కొనసాగుతుంది. దీని నివారణకు లీటరు నీటికి 1.5 ఎంఎల్ మోనోక్రోటోఫాస్ లేదా 1 గ్రాము ఎసిఫేట్ కలిపి పిచికారీ చేయాలి.
- తెల్లదోమ ఆకులోని రసాన్ని పీల్చి పంటకు నష్టం కలుగజేస్తాయి. వీటి వల్ల ఎల్లోమొజాయిక్ అనే వైరస్ వస్తుంది. నివారణకు లీటరు నీటికి 1.6 ఎంఎల్ మోనోక్రోటోఫాస్ లేదా 2 ఎంఎల్ మెటాసిస్టాక్స్ కలిపి పిచికారీ చేయాలి.
- మారుకా మచ్చల పురుగు మొగ్గ, పూత, పిందె దశలో ఆశించి ఎక్కువగా నష్టం చేకూరుస్తుంది. సరైన సమయంలో నివారణ చర్యలు చేపట్టకపోతే 50-80 శాతం నష్టం చేకూరుతుంది. ఈ పురుగు పూత, పిందెల దగ్గర చేరి గూడులో ఉంటూ కాయలోని గింజలను తింటుంది. దీని నివారణకు లీటరు నీటికి 1 గ్రాము ఎసిఫేట్ లేదా 2 ఎంఎల్ క్వినాల్‌ఫాస్ లేక 2.5 ఎంఎల్ క్లోరిపైరిఫాస్ లేదా 1ఎంల్ డైక్లోరోవాస్ కలిపి పురుగు ఉధృతి బట్టి 4-5 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.
- ఆకుముడత పురుగు పైరు లేత దశలో వృద్ధి చెంది ఆకుల్లోని రసాన్ని పీల్చి 15-20 శాతం నష్టాన్ని కలుగజేస్తాయి. వీటివల్ల ఆకుముడత వైరస్ వస్తుంది. ఇది వర్షాభావ పరిస్థితులకు తోడు అధిక ఉష్ణోగ్రతలున్నప్పుడు ఎక్కువగా వ్యాపిస్తుంది. దీని నివారణకు లీటరు నీటికి 1.5 ఎంఎల్ మోనోక్రోటోఫాస్ లేదా 1 గ్రాము ఎసిఫేట్ లేదా 1 ఎంల్ ఫిప్రోనిల్ కలిపి పిచికారీ చేయాలి.

సబ్ డివిజన్‌లో మినుము సాగు వివరాలు	
మండలం	సాధారణ విస్తీర్ణం(ఎకరాల్లో)
అవుకు	667
సంజామల	660
కోవెలకుంట్ల	343
కొలిమిగుండ్ల	183
దొర్నిపాడు	2345
ఉయ్యాలవాడ	365

రెండు ఎకరాల్లో మినుము సాగు



ఈ ఏడాది మినుము సాగుకు వర్షాలు అనుకూలంగా మారాయి. ప్రస్తుత ఖరీఫ్‌లో నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న, మినుము సాగుకు విత్తనాలు, రసాయన ఎరువులను సిద్ధం చేసుకున్నాను. గత ఏడాది పైరు చేతికందే తరుణంలో కురిసిన వర్షాలతో దిగుబడులు దెబ్బతిని నష్టపోయా.

–కుశాయప్ప, రైతు, అమడాల, కోవెలకుంట్ల

సూచనలు, సలహాలు అందజేయాలి



ఈ నెల నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన దృష్ట్యా వివిధ పంటల సాగులో వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు అందజేయాలి. ఒకటిన్నర ఎకరాల్లో ఈ ఏడాది మినుము సాగుకు పొలాన్ని సిద్ధం చేసుకున్నాను. రైతు సేవా కేంద్రాల ద్వారా సబ్సిడీపై విత్తనాలు, రసాయన ఎరువులు అందజేసి రైతులను ఆదుకోవాలి.

–సుబ్బరాయుడు, రైతు, కోవెలకుంట్ల

క్లుప్తంగా

చౌడేశ్వరిదేవి ఆలయానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయానికి హైదరాబాద్ వాస్తవ్యులు పిట్టల రజనీష్‌కుమార్, కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళం ఇచ్చారు. గురువారం ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీకుమార్‌రెడ్డి సమక్షంలో అర్చకులకు నగదు అందజేశారు. ఆదే విధంగా హైదరాబాద్ వాస్తవ్యులు పిట్టల కిశోర్‌కుమార్, లక్ష్మీ అన్నదానం కోసం రూ.10,116 అందజేశారు. దాతలను ఆలయ సంప్రదాయ ప్రకారం అమ్మవారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలతో సత్కరించారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి


పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

సంజామల: గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ సాల్మన్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరిని భాగస్వాములు చేయాలని సూచించారు. ఇందు కోసం అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని పేర్కొన్నారు. ఏఓ విజయకుమార్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు యోగా డే

అవుకు: మండలంలో శనివారం జరగనున్న యోగా డేను విజయవంతం చేయాలని ఎంపీడీఓ వెంగన్న అన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామ సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన వేదికలపై ఉదయం 7 గంటలకు యోగా కార్యక్రమం జరుగుతందన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది యోగాపై ప్రజలకు అవగాహన కల్పించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

వ్యక్తి ఆత్మహత్య

బొమ్మలసత్రం: నంద్యాల మండలం పెద్దకొట్టాల గ్రామానికి చెందిన చల్లా శ్రీనివాసులు (47) గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. తాలూకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. పెద్దకొట్టాల గ్రామానికి చెందిన శ్రీనివాసులు కొంత కాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకుంటున్నా ఆరోగ్యం కుదుటపడటం లేదని గురువారం తన స్వగృహంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య అంజినమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సమస్యకు పరిష్కారం


పేరుసోములలో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభం

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన గేటు వద్ద గురువారం విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారు. విద్యుత్ తీగలు పాఠశాల ప్రధాన గేటుకు తగులుతూ నిప్పురవ్వలు రాలుతూ ప్రమాదకరంగా ఉండేది. పాఠశాల ఉపాధ్యాయుల ఫిర్యాదు మేరకు విద్యుత్ ఏఈ దుర్గ శ్రీనివాస్ స్పందించారు. స్తంభం ఏర్పాటు చేసి విద్యుత్ తీగలను పాఠశాల గేటుకు తగలకుండా చర్యలు తీసుకున్నారు. సమస్యను పరిష్కరించిన విద్యుత్ అధికారులకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

సాంకేతిక విద్యతో మెరుగైన ఉపాధి


విద్యార్థినిని అభినందిస్తున్న సీఐ

డోన్ టౌన్: సాంకేతిక విద్యతో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా అన్నారు. పట్టణంలోని ఓ టైపింగ్ అండ్ షార్ట్‌హ్యాండ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన విద్యార్థిని 2025 మార్చిలో జరిగిన టైప్ రైటింగ్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో హయ్యర్ గ్రేడ్ విభాగంలో 3వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా గురువారం స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో విద్యార్థిని ముత్యాల లలితకు ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేసి అభినందించారు. టైప్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ శ్రీరాములు, విద్యార్థిని తండ్రి రామచంద్రరావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆర్టీఓ

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలని ఆర్టీఓ తిమ్మరసునాయుడు అన్నారు. పట్టణంలోని సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలలో గురువారం రోడ్డు రవాణా భద్రతపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం వల్లే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని తెలిపారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని పేర్కొన్నారు. అనంతరం అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌రెడ్డి, కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, సీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి రోడ్డు భద్రతలో పాటించాల్సిన నియమాలు, ఉల్లంఘన వల్ల జరిగే ప్రమాదాలు, ట్రాఫిక్ సిగ్నల్స్, తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ గీతా, హెచ్‌ఎం రోజా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధి అందరి బాధ్యత


మొక్క నాటుతున్న ఆర్డీటీ సభ్యులు

డోన్ టౌన్: సమాజ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆర్డీటీ సంస్థ డోన్ మండల కోఆర్డినేటర్ అంథోనిరెడ్డి అన్నారు. ఆర్డీటీ వ్యవస్థాపకుడు విన్సెంట్ ఫెర్రర్ వర్ధంతి సందర్భంగా గురువారం మల్లెంపల్లె గ్రామ జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం పిల్లలకు వాతావరణం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై వివరించారు.

చెత్త శుద్ధీకరణ ప్రక్రియ పరిశీలన


చెత్తను శుద్ధి చేస్తున్న యంత్రం

బేతంచెర్ల: పట్టణంలోని జంగాలపేట కాలనీ సమీపంలో ఉన్న నగర పంచాయతీ డంపింగ్ యార్డులో లెగసీ వేస్ట్‌ను ఆధునిక యంత్రాల ద్వారా శుద్ధి చేసే ప్రక్రియను డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. శుద్ధి చేసిన వ్యర్థాలతో కంపోస్ట్ మెటీరియల్‌ను పొలాల్లో సహజ ఎరువుగా ఉపయోగించుకోవచ్చని.. రాళ్లు ఇతర కఠిన వ్యర్థాలను భూగర్భ గుంతల పూడికకు ఉపయోగిస్తారని తెలిపారు. ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్ కోసం శుద్ధి కర్మాగారాలకు పంపిస్తారన్నారు. నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ ఉన్నారు.


పెద్దపొదిల్లలో శిథిలావస్థకు చేరుకున్న సంపద తయారీ కేంద్రం

చెత్త నుంచి సంపద తయారీ ఏదీ?



ఆకతాయిల చర్యలతో ధ్వంసమైన గోడలు, సంపద తయారీ కేంద్రంలో పడి ఉన్న మందు సీసాలు

- నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రాలు

ప్యాపిలి: చెత్త నుంచి సంపద తయారీ చేయాలన్న ఉద్దేశంతో 2014-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం గ్రామాల్లో షెడ్లను నిర్మించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో అట్టహాసంగా షెడ్లను నిర్మించారు. ఒక్కో షెడ్డుకు దాదాపు రూ. 3 లక్షల వరకు వెచ్చించారు. ప్యాపిలి మండలంలో అప్పట్లో ఉన్న 26 గ్రామ పంచాయతీల మేరకు 26 చెత్త సంపద తయారీ కేంద్రాలను నిర్మించారు.అయితే పలు గ్రామాల్లో నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. పలు గ్రామాల్లో నిర్మాణాలు పూర్తయినప్పటికీ వాటిని వినియోగించకపోవడంతో ప్రస్తుతం అవి నిరుపయోగంగా మారాయి.

కనిపించని చిత్తశుద్ధి

అప్పట్లో టీడీపీ ప్రభుత్వం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల గురించి విశేషంగా ప్రచారం చేసింది. గ్రామాల్లో చెత్తను సేకరించేందుకు గ్రీన్ అంబాసిడర్లను నియమించి వారి ద్వారా తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి ఈ షెడ్లలో ఆ చెత్తను నిలువ ఉంచుతారు. కొద్ది రోజుల తర్వాత ఈ చెత్త నుంచి తయారైన వర్మీ కంపోస్టును రైతులకు విక్రయించి తద్వారా పంచాయతీలకు ఆదాయం కల్పించాలన్నది ఈ కార్యక్రమం ఉద్దేశం. అయితే షెడ్లను నిర్మించి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్న విమర్శలు ఉన్నాయి.

దిష్టిబొమ్మల్లా సంపద తయారీ షెడ్లు

ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై నిర్లక్ష్యం వహిస్తోంది. పలు గ్రామాల్లో నిర్మించిన ఈ షెడ్లు కాలగర్భంలో కలసిపోగా..మరికొన్ని చోట్ల షెడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో అవి అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారాయి. ఇప్పటికైనా ప్రభుత్వం గ్రామాల్లో నిర్మించిన ఈ షెడ్లకు మరమ్మతులు చేపట్టి తిరిగి వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

దివ్యాంగుడి ఔదార్యం

బనగానపల్లె రూరల్: యాగంటి క్షేత్రంలోని ఉమామహేశ్వరస్వామి ఆలయం ఆవరణంలో కొద్ది రోజుల నుంచి జీవనం సాగిస్తున్న దివ్యాంగుడైన సీహెచ్ వెంకటరామయ్య ఆలయ అభివృద్ధి కోసం గురువారం రూ.10016లను విరాళంగా అందజేశారు. శివ పార్వతులపై ఉన్న భక్తితో ఈ విరాళాన్ని అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ చంద్రుడు, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, యాగంటిపల్లె ఉపసర్పంచ్ బండి మౌలిశ్వరరెడ్డి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

హామీల అమల్లో ప్రభుత్వం విఫలం

డోన్ టౌన్: కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని ఐద్వా నాయకురాలు షమీమ్ బేగం అన్నారు. గురువారం కొండపేటలో ఐద్వా సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 తదితర హామీలు ఇచ్చారన్నారు. అయితే ఏడాది పూర్తయినా హామీలు నేరవేర్చకపోవడం దారుణం అన్నారు. మహిళా హోంమంత్రి ఉన్నా రాష్ట్రంలో నిత్యం మహిళలపై దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కొండపేటశాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా సువర్ణ, ఉపాధ్యక్షులుగా జయలక్ష్మీ, కార్యదర్శిగా చాముండేశ్వరి, సహాయ కార్యదర్శిగా కమలమ్మ, కోశాధికారిగా రేష్మాలతో పాటు 15 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి


మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

బనగానపల్లె రూరల్: మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించి రుచికరమైన భోజనం వడ్డించాలని ఏఐఎస్ఎఫ్ మండల జాయింట్ సెక్రటరీ చందు అన్నారు. గురువారం బనగానపల్లె పట్టణంలోని కొండపేట జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలను ఏఐఎస్ఎఫ్ నాయకులు సందర్శించారు. మధ్యాహ్న భోజన నాణ్యతతో పాటు పాఠశాలలోని వసతులను పరిశీలించారు. భోజనంలో నాణ్యత లోపించిందని, ఉడికి ఉడకని అన్నం విద్యార్థులకు పెడుతున్నట్లు ఆరోపించారు. పాఠశాలలో మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. అధికారులు చర్యలు తీసుకుని నాణ్యత పాటించేలా చూడాలన్నారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు రాఘవ, సుదర్శన్, పండు, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు చంద్రబాబు నైజం


ఉప్పలపాడులో వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అవుకు: ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ హామీలతో ఓట్లు దండుకుని అధికారం చేపట్టిన తర్వాత వాటిని అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్‌సీపీ నాయకుడు చల్లా సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. అవుకు మండలం ఉప్పలపాడు గ్రామంలోని ఆయన స్వగృహంలో పార్టీ మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్ రెడ్డితో కలిసి గురువారం వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాడు కరోనా కష్టకాలంలోనూ రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం అనేక లోటుపాట్లను ఎదుర్కొంటూ అన్ని సంక్షేమ పథకాలను అందించారు కాబట్టే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అంటే ప్రజలకు నమ్మకమన్నారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ అంటూ మాయమాటలు చెప్పి ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకుని, నేడు సూపర్ సిక్స్ పథకాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గాలికొదిలేశారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో పేద విద్యార్థులు సైతం మెడికల్ విద్యను అభ్యసించాలని 17 మెడికల్ కాలేజీలను వైఎస్ జగన్ తీసుకొస్తే, నేడు కూటమి ప్రభుత్వం ఆ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తోందని విమర్శించారు. నీట్‌లో ర్యాంకులు వచ్చినా మెడికల్ సీట్లు రాక విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రజా సంక్షేమంపై కాకుండా వైఎస్సార్‌సీపీ శ్రేణులను హింసించడమే అజెండాగా అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. వీటన్నింటికీ రానున్న కాలంలో కూటమి ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని పేర్కొన్నారు. నాయకులు జూనూతల భాస్కర్ రెడ్డి, నారాయణ రెడ్డి, నీలకంఠేశ్వర రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


బనగానపల్లె ఎంపీపీ, ఉర్దూ పాఠశాల ఎదుట బురదమయమైన రోడ్డు

బురద రోడ్లతో ప్రయాణం నరకం

బనగానపల్లె రూరల్: గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారాయి. బనగానపల్లె మండలం మేజర్ గ్రామ పంచాయతీ పలుకూరు గ్రామంలోని ఎంపీపీ, ఉర్దూ పాఠశాలకు వెళ్లే రోడ్డు బురదమయంగా మారింది. నడిచి వెళ్లేందుకు కూడా వీలు లేకుండా మారింది. వాహనాల్లో వెళ్లాలన్నా ఎక్కడ జారిపడతామోనని భయాందోళన చెందాల్సిన పరిస్థితి. విద్యార్థులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని బస్టాండ్ నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎంపీపీ, ఉర్దూ పాఠశాల, గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లే ఈ రోడ్డును సీసీరోడ్డుగా మార్చేందుకు గతంలో సైడ్ కాల్వను నిర్మించారు. నిధుల సమస్య కారణంగా సీసీ రోడ్డు పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయినా సీసీ రోడ్డు నిర్మాణం గురించి పట్టించుకోవడం లేదు. చిన్నపాటి వర్షం కురిసినా బురదమయంగా మారి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


సంజామల: ఎస్సీ కాలనీలో సీసీరోడ్డుపై నిల్వవున్న మురుగునీరు

- **సంజామల:** మండల పరిధిలోని కానాల ఎస్సీ కాలనీలో మురుగునీరు ఇళ్ల ముందు నిల్వ ఉండడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. బయటకు వెళ్లాలన్నా మురుగు నీటిలో నడిచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షకాలం కావడంతో దోమల బెడద తీవ్రంగా ఉందని వాపోయారు. సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

- మున్సిపల్ స్థలాల ఆక్రమణ, అవినీతిపై తీర్మానానికి కౌన్సిలర్ల పట్టు
- కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారుల వ్యవహారశైలిపై మండిపాటు

డోన్: పట్టణంలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణ, మున్సిపల్ అధికారుల పనితీరు, అవినీతి, అక్రమాలపై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిపై తీర్మానం చేసి కలెక్టర్ పంపాలని డిమాండ్ చేశారు. గురువారం చైర్మన్ సప్తశైల రాజేష్ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. వైస్ చైర్మన్ కోట్రికె హరికిషన్, సీపీఐ కౌన్సిలర్ సుంకయ్య, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు మేకల విమల, సాధిక్, టమటం లక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు కుమ్మరి రాజు పట్టణంలోని ప్రభుత్వ స్థలాల్లో యథేచ్ఛగా జరుగుతున్న అక్రమ నిర్మాణాల గురించి కమిషనర్ ప్రసాద్‌గౌడ్, టౌన్ ప్లానింగ్ అధికారి శబరీష్‌లను నిలదీశారు. కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన కూరగాయల మార్కెట్‌లో ఒక్కో గదికి వ్యాపారులు రూ.18వేలు కిరాయి చెల్లిస్తుంటే వాటికి అడ్డంగా ప్రైవేటు ఏటీఎంలు, బంకులను ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. జాడీల ఫ్యాక్టరీ వద్ద వేసిన బంకులకు ఎవరి అనుమతి తీసుకున్నారని నిలదీశారు.

సభ మర్యాదలు తెలియవా


మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

మున్సిపల్ కమిషనర్‌తో పాటు ఇతర అధికారులు ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని కౌన్సిలర్లు ఆరోపించారు. చైర్మన్, కౌన్సిలర్లను పిలవకుండానే కౌన్సిల్ సమావేశం నిర్వహించాలనుకోవడం ఏంటని కమిషనర్‌ను ప్రశ్నించారు. ఉద్యోగులు బదిలీ అయిన విషయం కూడా తమకు తెలపకపోవడంపై చైర్మన్ విచారం వ్యక్తం చేశారు.

చలానా కడితే ఎక్కడైనా బంకులు వేయనిస్తారా

ఎంక్రోచ్‌మెంట్ ట్యాక్స్ కింద రూ.50వేలు చలానా కట్టినందు వల్లే మార్కెట్ చుట్టూ ప్రైవేటు ఏటీఎంలతో పాటు బంకులను వేయించామని అధికారులు తెలపడంతో కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరైనా రూ.50వేలు చలానా కడితే మున్సిపాలిటీతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో బంకులు వేయినిస్తారా అని ప్రశ్నించారు.

మానవత్వం లేదా

ఆప్కాస్ కింద పనిచేస్తున్న పలువురు మున్సిపల్ కార్మికులు విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మృతి చెంది ఐదారేళ్లు గడుస్తున్నా వారి కుటుంబ సభ్యుల్లో ఏ ఒక్కరికీ ఉద్యోగ అవకాశం కల్పించలేదని సీపీఐ కౌన్సిలర్ సుంకయ్య అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే చెప్పాడని ఏకంగా పది మందికి ఉద్యోగాలు ఇవ్వడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. మృతిచెందిన కార్మికుల కుటుంబీకులకు కాకుండా సిఫారసుపై వచ్చిన వారికి ఎలా ఉద్యోగాలు ఇస్తారని మండిపడ్డారు. కనీసం మానవత్వం లేకుండా అధికారులు ప్రవర్తిస్తుండడం సిగ్గుచేటన్నారు.

ఆక్రమణలపై జిల్లా కలెక్టర్‌కు తీర్మానానికి డిమాండ్

పట్టణంలో మున్సిపల్ స్థలాల ఆక్రమణలు, అందులో జరుగుతున్న అవినీతి, అక్రమాల గురించి సభ తీర్మానం చేసి జిల్లా కలెక్టర్‌కు పంపాలని కౌన్సిలర్లు డిమాండ్ చేయడంతో చైర్మన్ రాజేష్ అంగీకరించారు. అయితే తాము ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని.. పదిరోజులు గడువిస్తే ఆక్రమణలను తొలగిస్తామని కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు.